# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



సంపుటి : 2 సంచిక : 325 మంగళవారం 23 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## ఫిరాయింపులపై చర్యలు సాధ్యమేనా



- ఎమ్మెల్యేలపై ఖచ్చితంగా అనర్హతా వేటు పడుతుందని ఉపఎన్నికలు వస్తాయని కేటీఆర్ ఘంటాపథంగా చెబుతున్నారు.
- ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని అందుకే అనర్హతా వేటు ఖాయమంటున్నారు.
- న్యాయపోరాటం చేస్తున్నారు. హైకోర్టులో పిటిషన్లపై విచారణ జరుగుతున్నాయి
- కేటీఆర్ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయా అంటే.. చాన్సే లేదన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది.
- ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రజాప్రతినిధిగా ఎన్నికల పార్టీకి రాజీనామా చేసినా ఇతర పార్టీ సభ్యత్వం తీసుకున్నా అనర్హులవుతారు

హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఖచ్చితంగా అనర్హతా వేటు పడుతుందని ఉపఎన్నికలు వస్తాయని కేటీఆర్ ఘంటాపథంగా చెబుతున్నారు. అంతకు ముందు తాము విలీనం చేసుకున్నామని ఫిరాయింపులు కాదని అందుకే అనర్హతా వేటుకు అవకాశం లేదని కేటీఆర్ చెబుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని అందుకే అనర్హతా వేటు ఖాయమంటున్నారు. న్యాయపోరాటం చేస్తున్నారు. హైకోర్టులో పిటిషన్లపై విచారణ జరుగుతున్నాయి. కేటీఆర్ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయా అంటే.. - మిగతా3లో



### మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టు!

- కర్ణాటక అసెంబ్లీలో 'సెక్రటరీ-2' సృష్టి
- ఆర్థిక విభాగం ఆమోదానికి స్పీకర్ లేఖ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల ధ్వజం



### భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది'

- 2023-24 ఆర్థికసర్వేను లోక్ సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి
- 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది'
- ప్రపంచ అస్థిరతల నడుమ అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి మార్పు మాత్రమే స్థిరంగా ఉంటుంది
- వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలను చేరుకోవడం కష్టంగా మారింది
- కొన్ని నిర్దిష్ట ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ, ప్రధాన ద్రవ్యోల్బణం చాలావరకు నియంత్రణలో ఉంది

## మేడిగడ్డ చుట్టూ వాటర్ పాలిటిక్స్



- భారీ వర్షాలు కురుస్తూండటంతో గోదావరిలో వరద
- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల్లో జల కళ
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా నీరు సమృద్ధిగా
- బ్యారేజీ కూలిపోయిందని ప్రచారం చేశారని కానీ ఇప్పుడు నిండు కుండలా ఉందని చూడాలని .. కాంగ్రెస్ నేతలపై విమర్శలు

హైదరాబాద్

తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తూండటంతో గోదావరిలో వరద వస్తుంది. ఈ కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల్లో జల కళ కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా నీరు సమృద్ధిగా ఉంది. ప్రాజెక్టులో అన్ని గేట్లను ఎత్తి ఉంచారు. దీంతో వచ్చిన నీరు వచ్చినట్లుగా కిందకు పోతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మేడిగడ్డ దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రచారం చేశారని కానీ ఇప్పు నిండు కుండలా ఉందని చూడాలని .. - మిగతా3లో



### ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మల దహనం

- 15న దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ
- సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు
- ఈ ఆందోళనల్లో రైతులు, రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని

## అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలతో ఆస్తి, ప్రాణనష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలి..
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం
- వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- గతవారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై సీఎం సమీక్షిస్తున్నారు..
- పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి
- వర్షాలకు చెరువులు కుంటలు నిండాయి.. తెగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గతవారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై సీఎం సమీక్షిస్తున్నారని.. జిల్లాల్లో ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ముందుగానే పునరావాస కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్లకు సూచించారు. డీజీపీ జితేందర్, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వర్షాలకు చెరువులు కుంటలు నిండాయని.. తెగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ముందుజాగ్రత్తగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ టీంలను ఏర్పాటు చేయడం - మిగతా3లో




### నీట్ రద్దుకు కర్ణాటక బిల్లు

బెంగళూరు:

కర్ణాటకలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. నీట్‌కు బదులుగా వేరొక మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహించాలని, లేదంటే, దీనిని రాష్ట్రంలోని కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌తో కలపాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. పన్నెండో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్స్ కల్పించేందుకు రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని కోరింది. నీట్-యూజీ 2024 పరీక్షల్లో పేపర్ లీక్, తదితర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును శాసన సభలో ప్రవేశపెడతారు.

## నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు..!

లాస్య నందితకు సంతాపం తెలుపనున్న సభ

బడ్జెట్ సమావేశాల పనిదినాలు, అజెండాను బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఖరారు చేయనున్నది.



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం మొదలవనున్నాయి. ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభమవుతుంది. అనంతరం దివంగత ఎమ్మెల్యే లాస్య నందితకు అసెంబ్లీ సంతాపం తెలుపునున్నది. లాస్య నందితకు సంతాపం తెలిపే తీర్మానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశపెడుతారు. సంతాపం అనంతరం శాసనసభ నిరవధికంగా వాయిదాపడనున్నది. సభ వాయిదా అనంతరం సభా వ్యవహారాల కమిటీ భేటీ కానున్నది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల పనిదినాలు, అజెండాను బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఖరారు చేయనున్నది.

## భారత్ సరిహద్దుల్లో పాక్ 'ఉగ్ర' పన్నాగం,

# సైన్యం దగ్గరుండి మరీ...

**శ్రీనగర్ :** భారత్ సరిహద్దుల్లో దాయాది దేశం పాకిస్థాన్ రెచ్చిపోతోంది. ఎల్‌ఓసీ వెంబడి భారత భూభాగంలోకి దగ్గరుండి మరీ సాయుధ ఉగ్రవాదులను పంపిస్తోంది. వీరికి పాక్ సైనికులు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఇటీవల వెలుగుచూడగా, తాజాగా మరికొన్ని ఫోటోలు వెలుగుచూశాయి. మారణాయుధాలతో ఉన్న సుమారు ఐదుగురు ఉగ్రవాదులు, వీరికి గార్డుగా పాకిస్థాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ కమండో జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో వేచి ఉండటం ఇందులో కనిపిస్తోంది. భారత సైన్యం కన్నుకప్పి ఎక్కడి నుంచి భారత భూభాగంలోకి చొరబడాలనే దానిపై పాక్ సైనికులు ముందుగానే ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారని ఈ ఫోటోల్లో స్పష్టమవుతోంది.



**జమ్మూలో పెరుగుతున్న ఉగ్రదాడులు**

జమ్మూ ప్రాంతంలో దశాబ్దాల ఉగ్రవాదాన్ని భారత భద్రతా బలగాలు తుడిచిపెట్టడంతో 2005-2021 మధ్య చాలామటుకు ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే గత నెలరోజులుగా ఉగ్రదాడులు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడులో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 40 మంది గాయపడ్డారు. జంట సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో గత అక్టోబర్‌లో తిరిగి ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగుచూశాయి. రియాసి, కథువా, దోడాల్లో సెక్యురిటీ పోస్టులపై దాడులు చోటుచేసుకున్నాయి. 2021 నుంచి జమ్మూ రీజియన్‌లో జరిగిన ఉగ్ర సంబంధిత ఘటనల్లో 52 మంది భద్రతా సిబ్బందితో సహా 70 మందికి పైగా ప్రామాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది ఆర్మీకి చెందిన వారే ఉన్నారు.

## మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టు!



**బెంగళూరు:** కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడి కోసం అసెంబ్లీలో ఒక కొత్త పోస్టును సృష్టించడం రాజకీయ దుమారం రేపింది. విధానసభలో 'అసెంబ్లీ కార్యదర్శి' అనే ఒక పోస్టు ఇప్పటికే ఉండగా.. దానికి అదనంగా 'సెక్రటరీ-2' అనే పోస్టును సృష్టించి, దాన్ని అమాత్యుడి అల్లుడికి కేటాయించేందుకు ప్రభుత్వం పావులు కదపడంపై విపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కొత్త పోస్టు సృష్టికి సంబంధించి అసెంబ్లీ స్పీకర్ అసెంబ్లీ ఆర్థిక విభాగానికి లేఖ రాసిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు శశిధర్ కోసం ఈ కొత్త పోస్టును ఏర్పాటు జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

**సెక్రటరీ అవకాశం లేకపోవడంతో..**

కొత్త పోస్టును సృష్టించడాన్ని కర్ణాటక విధాన సభ ఉద్యోగుల సంఘం వ్యతిరేకించింది. శశిధర్‌కు సెకట్రరీ పోస్టు వచ్చే అవకాశం లేకపోవడంతోనే 'సెక్రటరీ-2' అనే పోస్టును ఏర్పాటు చేయించారని అసెంబ్లీ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ మండిపడింది. ఎమ్మెల్యేల తిరుగుబాటు ప్రయత్నాలను చల్లార్చేందుకు రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘిస్తూ 90 క్యాబినెట్ గ్రేడ్ స్థాయి హెూదాలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టును సృష్టించారని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఆర్ అశోక్ విమర్శించారు.

## ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మల దహనం



ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కేఎంఎం న్యూఢిల్లీ: రైతు డిమాండ్లు నెరవేర్చాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం-నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయి. దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని, ఆగస్టు 15న ట్రాక్టర్ ర్యాలీ చేపడతామని ప్రకటించాయి. ఈ ఆందోళనల్లో రైతులు, రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరాయి. ఈ మేరకు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. న్యూఢిల్లీలో కేఎంఎం నాయకుడు సర్వన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ, 'రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్ ఆగస్టు 31నాటికి 200 రోజులు పూర్తిచేసుకుంటుంది. ఖానౌరి, శంభు వద్దకు రావాల్సిందిగా రైతులందర్నీ కోరుతున్నాం' అని చెప్పారు.

# సుప్రీంకోర్టు 'స్టే'పై ఎన్డీయే కీలక భాగస్వామి హర్షం

**న్యూఢిల్లీ:** కావడి యాత్ర మార్గంలోని హెూటళ్లు, తోపుడుబండ్ల ముందు వాటి యజమానులు, సిబ్బంది పేర్లు పెట్టాలంటూ ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారంనాడు 'మధ్యంతర స్టే' ఇచ్చింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయంపై విపక్షాలు హర్షం వ్యక్తం చేయగా, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కీలక భాగస్వామి జనతాదళ్ యూనైటెడ్ సైతం తీర్పును స్వాగతించింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఆదేశాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, తినుబండారాల విక్రేతలు తమ దుకాణాల వద్ద యజమానులు, ఉద్యోగుల పేర్లు ప్రదర్శించాలంటూ బలవంతం చేయరాదని న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్వీఎస్ భట్టితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

**స్వాగతిస్తున్నాం: జేడీయూ**

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి స్వాగతించారు. సమాజాన్ని విడగొట్టేలా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయనే ఆందోళనలు తమకు ఉన్నాయన్నారు. ఈ విజయాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

**సీఎంలకు మోదీ రాజధర్మం చెబుతారా?: కాంగ్రెస్**





సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేర చెప్పారు. యోగి సర్కార్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకమని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీ మొత్తం చెప్పాయని, ప్రధాని మంత్రి ఇప్పటికైనా తమ ముఖ్యమంత్రులకు 'రాజధర్మం' గురించి వివరించి, ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా చూస్తారని ఆశిస్తున్నామని అన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని, అధికార బీజేపీ ఈ తరహా దిగజారుడు రాజకీయాలు జరుపుతోందని అన్నారు

## ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై గవర్నర్ జరిమానా రూ.500

**బెంగాల్‌లో కొనసాగుతున్న 'ప్రమాణ స్వీకార' రగడ**



**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ఉప ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంపై రగడ కొనసాగుతున్నది. స్పీకర్ వారి చేత ప్రమాణం చేయించడం, తాజాగా సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ రాజ్‌భవన్ ఆ ఇద్దరు శాసనసభ్యులపై రూ.500 చొప్పున జరిమానా విధించింది. ఈ మేరకు గవర్నర్ సీవీ ఆనంద బోస్ కార్యాలయం నుంచి తమకు మెయిల్స్ వచ్చాయని ఎమ్మెల్యేలు హుస్సేన్ సర్కార్, శయంతికా బెనర్జీ సోమవారం వెల్లడించారు. ప్రమాణ స్వీకార ప్రక్రియ చట్టబద్ధతను ప్రశ్నించిన రాజ్‌భవన్.. రూ.500 జరిమానా చెల్లించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈనెల 5న ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార ప్రక్రియను గవర్నర్ డిప్యూటీ స్పీకర్ అశిష్ బెనర్జీకి అప్పగించగా.. వారిద్దరి చేత స్పీకర్ బిమన్ బెనర్జీ ప్రమాణం చేయించారు. దీనిపై తాము స్పీకర్‌ను కలిశామని శయంతికా బెనర్జీ తెలిపారు. ఈ అంశాన్ని స్పీకర్ కార్యాలయం చూసుకుంటుందని ఆయన చెప్పారని పేర్కొన్నారు. తాము జరిమానా చెల్లించేది లేదని స్పష్టం చేశారు.

# భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది'

**న్యూ డిల్లీ :** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టబోతోంది. ఈ క్రమంలో బడ్జెట్‌కు ఒక రోజు ముందుగా ఇవాళ 2023-24 ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టారు. 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది' అని ఈ ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ప్రపంచ అస్థిరతల నడుమ అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి మార్పు మాత్రమే స్థిరంగా ఉంటుందని ఈ సర్వే తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలను చేరుకోవడం కష్టంగా మారిందని పేర్కొంది. 2022 నుంచి ప్రైవేటు రంగం పెట్టుబడులు పెడుతున్నప్పటికీ కొన్నేళ్లుగా ప్రభుత్వ పెట్టుబడులు మూలధనాన్ని కొనసాగించాయని ఈ ఆర్థిక సర్వే



స్పష్టంచేసింది. గడచిన రెండు సంవత్సరాలుగా 7.0 శాతం వృద్ధిరేటును నమోదు కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అధికంగా 9.7 శాతం వృద్ధిరేటు నమోదయ్యే అవకాశం ఉందని ఈ ఆర్థిక సర్వే అంచనా వేసింది. కొన్ని నిర్దిష్ట ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ, ప్రధాన ద్రవ్యోల్బణం చాలావరకు నియంత్రణలో ఉందని తెలిపింది. 2023 కంటే 2024లో వాణిజ్యలోటు తక్కువగా ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. జీడీపీలో కరెంట్ ఖాతా లోటు దాదాపు 0.7 శాతంగా ఉందని పేర్కొంది. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులును నమోదు చేసినట్లు తెలిపింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఈ ఆర్థిక సర్వే పేర్కొన్నది. ఓ 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఈ సర్వే సూచించింది. 2023-24 ఆర్థిక సర్వేను ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు పర్యవేక్షణలో ఈ ఆర్థిక సర్వేను రూపొందించారు. ఇక ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్ ఏడోసారి లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. గతంలో ఆర్థికమంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదుసార్లు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఆయన రికార్డును నిర్మలాసీతారామన్ గత ఏడాదే బద్దలుకొట్టారు. ఇప్పుడు ఆ రికార్డును మరింత మెరుగుపర్చుకోబోతున్నారు

## ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో మంటలు

**నావికుడు గల్లంతు**

**తీవ్రంగా దెబ్బతిన్న యుద్ధ నౌక**



**ముంబై :** ముంబై నావల్ డాక్‌యార్డ్‌లో మరమ్మత్తులు జరుపుకుంటున్న యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర'లో ఆదివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. డాక్‌యార్డ్‌లో ఇతరుల సాయంతో అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చినట్టు భారత నౌకాదళం సోమవారం తెలిపింది. ఈ ఘటనలో ఓ నావికుడు గల్లంతయ్యాడని, యుద్ధ నౌకలోని ఓ వైపు భాగం దెబ్బతిన్నదని వెల్లడించింది. గల్లంతైన నావికుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నది. యుద్ధ నౌకలో మంటలు అదుపులోకి వచ్చినా, యుద్ధనౌక నిటారుగా నిలువలేక.. ఓ వైపునకు ఒరిగిపోయింది. సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటకీ.. యుద్ధ నౌక తిరిగి పూర్వపు స్థితికి రాలేకపోయింది. ఘటనపై భారత నౌకాదళం విచారణకు ఆదేశించింది

# నీట్'పై నిలదీసిన రాహుల్.. దాపరికాలేవీ లేవన్న ధర్మేంద్ర ప్రధాన్


**న్యూఢిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజే 'నీట్' పేపర్ లీక్ అంశంపై అధికార పక్షాన్ని విపక్షాలు నిలదీశాయి. పేపర్ లీక్ అనేది తీవ్రమైన సమస్య అని, దీనికి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలని విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దీనికి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ, ప్రభుత్వానికి ఎలాంటి దాపరికారాలు లేవని అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో 'నీట్' పరీక్షా పత్రం లీకేజీ అంశాన్ని రాహుల్ లేవనెత్తుతూ, పేపర్ లీక్‌పై మంత్రి (ధర్మేంద్ర ప్రధాన్) తనను తప్ప అందరినీ నిందించారని అన్నారు. 'నీట్' విషయంలోనే కాకుండా మన పరీక్షా విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉందని యావద్దేశానికి స్పష్టంగా అర్థమైందని, అయితే మంత్రి మాత్రం తనను తాను మినహాయించుకుని అందరినీ నిందించారని అన్నారు. అసలిక్కడ ఏమి జరుగుతోందో దాని మౌలిక సూత్రాలను కూడా ఆయన అర్థం చేసుకున్నట్టు తనకు అనిపించడం లేదన్నారు. పశ్నాపత్రాల లీకేజీ వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దేశంలో పరీక్షల వ్యవహారం మొత్తం ఒక 'ఫ్రాడ్'గా మారిందన్నారు. డబ్బున్నోళ్లు విద్యావ్యవస్థను కొనేస్తున్నారని లక్షలాది మంది ప్రజలు నమ్ముతున్నారని, విపక్షాల అభిప్రాయం కూడా ఇదేనని స్పష్టం చేశారు.

**లీకేజీల్లో రికార్డు...**

సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విమర్శలు గుప్పిస్తూ, ప్రశ్నాపత్రాల లీకేజీలో ప్రభుత్వం రికార్డు సృష్టించిందని అన్నారు. కొన్ని సెంటర్లలో 2000 మందికి పైగా పాసయ్యారని, విద్యాశాఖ మంత్రి (ధర్మేంద్ర ప్రధాన్) ఇక్కడ ఉన్నంతవరకూ విద్యార్థులకు న్యాయం జరగదని అన్నారు.

**ఏడేళ్లుగా లీకేజీ దాఖలాలు లేవు.. మంత్రి**

నీట్ ప్రశ్నాపత్నం లీకేజీ వ్యవహారంపై విపక్ష సభ్యులు అడిగిన



ప్రశ్నకు ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ, ప్రభుత్వం ఏదీ దాచిపెట్టడం లేదని, నిజానిజాలను సుప్రీంకోర్టుకు తెలియజేసిందని, ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉందని చెప్పారు. కోర్టు ఇచ్చే ఆదేశాల గురించి మనం ఎదురుచూద్దామని చెప్పారు. ఈ ఏడాది మే 5న నీట్-యూజీ పరీక్ష జరిగినప్పుడు పాట్నాలో పేపర్ లీక్ చోటుచేసుకోవడం మినహా గత ఏడేళ్లలో ఎలాంటి పేపర్ లీకేజీలు లేవన్నారు. ప్రస్తుతం నీట్ పేపర్ లేకేజీ వ్యవహారంపై సీజేఐ నేతృత్వంలో విచారణ జరుగుతున్నందున వాస్తవాలన్నీ బయటకు వస్తాయని చెప్పారు. ఎన్‌టీఏ ఏర్పాటు చేసినప్పటి నుంచి 240కి పైగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 5 కోట్ల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 4.5 కోట్ల మంది పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు.

# ఫిరాయింపులపై చర్యలు సాధ్యమేనా

-మొదటిపేజీ తరువాయి

చాన్సే లేదన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రజాప్రతినిధిగా ఎన్నికల పార్టీకి రాజీనామా చేసినా ఇతర పార్టీ సభ్యత?వం తీసుకున్నా అనర్హులవుతారు. 1985లో రాజీవ్గాంధీ ప్రభుత్వం రాజకీయ ఫిరాయింపులను అరికట్టడానికి ఫిరాయింపుల వ్యతిరేకతపై 52వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని చేసింది. దీనిని రాజ్యాంగంలో 10వ షెడ్యూల్లో చేర్చారు. అయితే... అంతా స్పీకర్ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ చట్టం కింద ఒక సభ్యుని అనర్హతకు కోర్టులకు అధికారం లేదు. పార్టీ ఫిరాయింపు, పార్టీలో చీలిక, పార్టీ విప్పు ధిక్కరించి ఓటు వేయడం లేక గైర్హాజరు కావడం మొదలైన అంశాలు వివాదాస్పదంగా మారినప్పుడు ఆ వివాదాలపై అంతిమ నిర్ణయం స్పీకర్కు వదిలేయాలని చట్టంలో ఉంది. అధికార పార్టీకి చెందిన స్పీకర్లు ఇప్పుడు నిర్ణయాలు తీసుకోవడం లేదు. చట్టంలో ఉన్న లొసుగుల్ని బట్టి రాజకీయ నేతలు కూడా వ్యవహరిస్తున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ఉంది కానీ.. అది స్పీకర్ చేతుల్లో ఉంటుంది కాబట్టి... ప్రయోజనం లేకుండా పోయింది. దేశంలో స్పీకర్లందరూ... అదే చేస్తున్నారు. ఈ చట్టాన్ని మార్చాలి. పార్టీ మారిన వెంటనే అనర్హతా వేటు పడేలా చేయాలి. అలా చేస్తే తప్ప ఇప్పుడు కేటీఆర్ చెబుతున్నట్లుగా అనర్హతా వేటు పడటానికి అవకాశం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో గతంలో బీఆర్ఎస్ స్పీకర్లూ అదే చేశారు. కేటీఆర్ తాము ఎల్పీలను విలీనం చేసుకున్నామని చెబుతున్నారు. కానీ 2014లో మొదట టీడీపీ సభ్యులను చేర్చుకున్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కు మంత్రి పదవి కూడా ఇచ్చారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఉండి ఆయన బీఆర్ఎస్ సర్కార్ లో మంత్రిగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. టీడీపీ దాఖలు చేసిన అనర్హతా పిటిషన్లను పట్టించుకోలేదు. శాసనమండలి చైర్మన్ కూడా అదే చేశారు. 2022 మేలో శివసేన నుంచి కొంత మంది ఎమ్మెల్యేలు, బీజేపీ కలిసి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2023 జూలైలో ఎన్సీపీ నేత అజిత్ పవార్, తన పార్టీని చీల్చి 40 మంది ఎమ్మెల్యేలు, 5గురు ఎమ్మెల్సీలతో కలిసి షిండే క్యాబినెట్లో చేరి ఉపముఖ్యమంత్రిగా పదవి తీసుకున్నారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు లేఖ అందజేశారు. అయితే స్పీకర్ పట్టించుకోక పోవడంతో శరద్ పవార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పలుమార్లు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది కానీ ఫలానా నిర్ణయం అని చెప్పలేదు. అదే సమయంలో స్పీకర్ కూడా తన విచక్షణాధికారం అని సుప్రీంకోర్టు ఆదేశాలను పెద్దగా పట్టించుకోలేదు. అయితే తర్వాత నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మహారాష్ట్ర వరకే పరిమితం కనీ దేశానికి వర్తిస్తాయని.. కేటీఆర్ వాదిస్తున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వ లాయర్లు మాత్రం స్పీకర్ విధుల్లో జోక్యం చేసుకోలేరని వాదిస్తున్నారు. ఎలా చూసినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారమే ఫైనల్. ఆయన తన పార్టీ నిర్ణయం.. గత సంప్రదాయాల ప్రకారమే వ్యవహరించే అవకాశం ఉంది. అంటే అనుకుంటే తప్ప... ఎవరిపైనా అనర్హతా వేటు పడే అవకాశం లేదు.

# అయ్యా సీఎంగారు... ఏడు నెలలైనా... ఇంతేనా...





**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తను ఇచ్చిన రెండు దరఖాస్తులపై ఎలాంటి స్పందన లేదని మాజీ డీఎస్పీ నళిని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలోనే పూర్తి అవుతుందని భావించాను కానీ? 7 నెలలు దాటిపోయిందంటూ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నళిని? తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఈ పేరు చుట్టూ తెగ చర్చ జరిగింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో.. తన డీఎస్పీ పదవికి రాజీనామా చేసి వార్తల్లోకి ఎక్కారు ఈమె. ఆ తర్వాత రాష్ట్ర సాధన కోసం క్రియాశీలకంగా పోరాడారు. ఉద్యమ వాణిని వినిపించేందుకు పరకాల బైపోల్ బరిలోనూ నిలబడ్డారు. ఉద్యమ సమయంలో ఎంతో పేరు సంపాదించికున్న నళిని? ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ఆమె ప్రస్తావన పెద్దగా లేకుండా పోయింది. పదేళ్లలో కూడా పెద్దగా కనిపించిన దాఖలు లేవు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా? నళిని ప్రస్తావన తీసుకొచ్చారు. తిరిగి డీఎస్పీ ఉద్యోగం ఎందుకు ఇవ్వకూడదనే అంశంపై ఆరా తీశారు. పోలీసు ఉద్యోగం కుదరకపోతే? అదే స్థాయిలో ఉండే మంచి ఉద్యోగాన్ని ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంలో నళినితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వటంతో.. మళ్లీ మాజీ డీఎస్పీ నళిని ఉద్యోగ అంశం తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో ఆమె స్వయంగా వెళ్లి డిసెంబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. అధ్యాత్మిక ప్రచారానికి సాకారం (వేద విద్యా కేంద్రం)అందించటంతో పాటు తన సర్వీస్ అంశానికి సంబంధించి లేఖలను ఇచ్చినట్లు తెలిసింది.అయితే తాజాగా మాజీ డీఎస్పీ నళిని ఫేస్ బుక్ లో పోస్ట్ చేశారు. సీఎం కలిసిన ఒక్క నెలలోనే తన పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తి చేస్తారని భావించానని?. కానీ 7 నెలలు పూర్తి కావొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తన రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నాయా?? లేక చేత బుట్టలోకి పోయాయా..? అంటూ తన అనుమానాన్ని వ్యక్తం చేసింది."సిఎం సార్ కొలువుకు ఎక్కగానే నన్ను మీద మీద యాది చేసిండు .ఇప్పుడేమో సప్పుడే చేస్తలేడు. మధ్యల తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగినాయి.ఆశ్చర్యంగా నా ఊసే ఎత్తలేదు.ఇంతకీ నా రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నయో లేక చెత్త బుట్టలోకి పోయినవోనని డౌట్ వస్తుంది. ఇప్పుడే చీఫ్ ఇతీనీ ను నీబట బతితీ ని కదిలించా?! చిట్టి రాసిన. మా చిన్నప్పుడు ఆడుక్కొనేటోడు ఇంటి ముందుకు వస్తె ,ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి వెళ్లవయ్య అని మెల్లగా చెప్పేటోల్లం. కనీసం ఆ పాటి మర్యాద అయినా నాకు ఇస్తారేమో చూడాలి.అందుకే నేను ఇన్నేళ్ళు ఎవ్వరినీ కలవాలే.ఉద్యమం చేసేటప్పుడే నాకు చాలా విషయాలు అర్థం అయినవి""ఒక నెలలోనే నా పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తిచేస్తారు అనుకున్నా. 7 నెలలు కావొస్తోంది.అందుకే రిమైండర్ లెటర్,పోస్ట్ రాయాల్సి వచ్చింది. సెక్రటేరియట్ చూట్టూ తిరిగేంత సమయం మరియు ఓపిక నా వద్ద లేవు అని నేను ఆ రోజే రేవంతన్నకు చెప్పినా?!" అని నళిని తన పోస్టులో రాసుకొచ్చారు.తాజాగా నళిని చేసిన పోస్టులో ప్రభుత్వానికి రాసిన లేఖను కూడా పోస్ట్ చేసింది. డిసెంబర్ 30, 2023వ తేదీన ముఖ్యమంత్రికి రెండు పిటిషన్లు ఇచ్చానని గుర్తు చేశారు. అయితే నళిని చేసిన తాజా లేఖపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది?.

# టార్గెట్ హరీశ్ రావు...



**మెదక్ :** కేసీఆర్ సొంత జిల్లా మెదక్‌లో రాజకీయం ఆసక్తిరేపుతోంది. వచ్చేస్థానిక ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లాలో బలమైన శక్తిగా ఎదగాలని భావిస్తోన్న కాంగ్రెస్? కారు పార్టీని ఖాళీ చేసేవిధంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని హస్తం గూటికి చేర్చుకోగా, ఇప్పుడు మిగిలిన ఎమ్మెల్యేలపై వల విసురుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఉమ్మడి మెదక్ జిల్లాల్లో మొత్తం ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ చేతిని అందుకున్నారు. ఇక మిగిలిన ఆరుగురిలో కేసీఆర్, హరీశ్‌రావు మినహా నలుగురితో హస్తం నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మినహా మిగిలిన ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే ఓ సారి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తొలి నెలరోజుల్లోనే ఉమ్మడి మెదక్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలవడం అప్పట్లో సంచలనమైంది. అప్పుడే వీరు పార్టీ మారనున్నారనే ప్రచారం ప్రారంభమైంది. కానీ, అప్పట్లో ఈ ప్రచారాన్ని ఖండిన నేతలు? ఇప్పుడు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరేందుకు అడుగులు వేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సీఎం రేవంత్‌ను కలిసిన వారిలో ఇప్పటికే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా, నెక్ట్స్ ఎవరనేది ఆసక్తి రేపుతోంది.సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికల సమయానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బలపడాలనే వ్యూహంతో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ మూడుచోట్ల గెలిస్తే పటాన్‌చెరు ఎమ్మెల్యే చేరికతో హస్తం బలం నాలుగుకు చేరింది. ఇక చకచకా చేరికలు పూర్తిచేసి మెజార్టీ మండలాలు, మున్సిపాలిటీల్లోనూ పాగా వేయాలని ప్లాన్ చేస్తోంది కాంగ్రెస్. దీనిద్వారా క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసి మాజీ మంత్రి హరీశ్‌రావుకు జిల్లాలో చెక్ పెట్టాలని చూస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు విరుచుకుపడే హరీశ్‌రావును మెదక్ లోనే దెబ్బతీసి? సర్కార్ పై గట్టిగా గళం విప్పకుండా నివారించాలనేది కాంగ్రెస్ ప్లాన్ గా కన్పిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, సీనియర్ నేత జగ్గారెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేసినట్లు చెబుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే స్థాయి నేతలను చేర్చుకుంటూనే? దిగువస్థాయిలోనూ వలసలను ప్రోత్సహించాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధిపత్యానికి గండి కొట్టి?. ఆయనను ఒంటరిని చేసేలా పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది టీపీసీసీ? ఇప్పటికే రుణమాఫీ విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావుతో మాటల యుద్ధానికి దిగిన కాంగ్రెస్? మున్ముందు బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్‌నే ట్రబుల్స్‌లోకి నెట్టేందుకు పక్కావ్యూహం రచిస్తోంది.గులాబీ బాస్ సొంత జిల్లా అయినప్పటికీ? ఉమ్మడి మెదక్‌లో రాజకీయం అంతా హరీశ్‌రావు చుట్టూనే తిరుగుతుంది. గజ్వేల్‌లో కేసీఆర్‌ను గెలిపించే బాధ్యత కూడా హరీశే తీసుకుంటుంటారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో తనకున్న వ్యక్తిగత పలుకుబడితో బీఆర్ఎస్‌ను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దారు హరీశ్‌రావు.అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా చూపినా.. మిగతా ఏ జిల్లాల్లో లేని విధంగా ఒక్క ఉమ్మడి మెదక్‌లోనే ఏడు చోట్ల గెలిచి స్పష్టమైన ఆధిపత్యాన్ని చూపింది బీఆర్ఎస్. దీంతో హరీశ్‌రావు కంచుకోట మెదక్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ చేసింది కాంగ్రెస్. పార్లమెంట్ ఎన్నికల నాటికి కొంత మేర పుంజుకున్నా? జిల్లాపై సంపూర్ణ ఆధిపత్యం చలాయించలేకపోయామనే ఉద్దేశంతో ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్‌లో తొలి ప్రాధాన్యంగా మెదక్‌ను తీసుకున్నట్లు చెబుతున్నారు.మొత్తానికి హరీశ్‌రావు టార్గెట్‌గా జరుగుతున్న రాజకీయం ఆసక్తికరంగా మారింది. మరి కాంగ్రెస్ వ్యూహాన్ని హరీశ్‌రావు ఎలా చేధిస్తారో చూడాలి మరి

## అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

జరిగిందన్నారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర సహాయం కావాలన్నా సంప్రదించాలని సీఎస్ సూచించారు. పారే వాగులను ఎవరూ దాటకుండా ఆయా ప్రాంతాలలో తగు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అందరు పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, కలెక్టర్లతో పాటు ఇతర అధికారులతో సమన్వయం చేస్తూ పని చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పోలీస్ అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. భద్రాచలం వద్ద ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేశామని.. 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే జిల్లాల్లో దెబ్బతిన్న నివాస గృహాలు, ఇతర నష్టాలపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ములుగు జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతం ఉందని, 77 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ముందస్తు జాగ్రత్తలను చేపట్టామని చెప్పారు. అధికారులంతా క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని, వీలైనంత వేగంగా స్పందించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

## మేడిగడ్డ చుట్టూ వాటర్ పాలిటిక్స్



-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ నేతలపై విమర్శలు గుప్పించారు. మేడిగడ్డ బ్యారేజీ లో కొన్ని పిల్లర్లు కుంగిపోయాయి. వర్షం వచ్చి భారీ వరద వస్తే ప్రాజెక్టు కూడా కొట్టుకుపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం ఇటీవల కొన్ని తాత్కలిక మరమ్మతులు చేయించింది. ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే ప్రమాదమేనని వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదలేయాలని సూచించారు. దీంతో అధికారులు అన్ని గేట్లు ఎత్తివేశారు. అయితే బీఆర్ఎస్ నేతలు స్వయంగా కేటీఆర్ కూడా స్పందించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో..కాంగ్రెస్ కుట్రలే కొట్టుకుపోయాయన్నారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కేటీఆర్ కు పరోక్షంగా కౌంటర్ ఇచ్చింది. అసలు ప్రాజెక్టు నిర్మించినది ఎందుకని ప్రశ్నించింది. నీళ్లు నిలిపితే కొట్టుకుపోయే ప్రాజెక్టును ఎవరు నిర్మిస్తారని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. నీరు నిలబెట్టలేని ప్రాజెక్టు గురించి గొప్పలు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన పగుళ్ల అంశం చర్చనీయాంశం అయింది. ఓ దశలో అదే గెలుపోటములను నిర్దేశించే రాజకీయ అంశంగా మారడంతో కాంగ్రెస్ అడ్వాంటేజ్ తీసుకుది. డిగడ్డ బ్యారేజీకి ఏర్పడ్డ పగుళ్లను చూపిస్తూ.. ఇక ఆ బ్యారేజీ వేస్ట్ అని ప్రచారం చేసింది. దాని రిపేర్ చేయలేమని, కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పెట్టిన ఖర్చు మొత్తం బూడిదలో పోసిన పన్నీరే అని కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లింది. ఇప్పటికీ అదే చెబుతోంది. నీరు నిలుపలేకపోతే లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టులు ఎందుకు అని ప్రశ్నిస్తోంది. ప్రస్తుతం మేడిగడ్డ భద్రతపై నిపుణులు కూడా ఆందోళన చెందుతున్నారు. వరద వచ్చి వెళ్లిపోయిన తరవాత ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుందోనని కంగారు పడుతున్నారు.

## నిజామాబాద్‌లో అమ్మో...కుక్కలు

**నిజామాబాద్ :** ఒక్క జూన్ నెలలోనే 435 కేసులు.. ఈ నెలలో ఇప్పటివరకు 243.. గత ఆరు నెలలుగా 300కు పైగానే.. సగటున రోజుకు 10 మంది ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కుక్కల దాడిలో గాయపడుతున్నారు. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆకలి మంటతో జనం మీద దాడి చేస్తున్నాయి. వాటి పునరుత్పత్తి సీజన్లో డాగ్బైట్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.వాటి పిల్లలను కాపాడుకునే ప్రయత్నంలో దగ్గరగా నడుచుకుంటూ వెళ్లేవారిని ఎటాక్ చేస్తున్నాయి. బండ్లపై వెళ్లే వారిని, ఇంటి బయట ఆడుకుంటున్న పిల్లలను వదలట్లేదు. అసలు ఎటు నుంచి వచ్చి కుక్కలు దాడులు దాడి చేస్తున్నాయో తెలియక ప్రజలు రోడ్డు ఎక్కాలంటేనే భయపడుతున్నారు. డాగ్ బైట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గవర్నమెంట్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని ఎనిమల్ బెర్త్ కంట్రోల్ రూమ్ బాధ్యతలు పెంచింది. వీధి కుక్కల సమాచారం తెలపడానికి 08462-220234 నంబర్ను పౌరుల కోసం అందుబాటులో తెచ్చినట్లు నగర పాలక కమిషనర్ మంద మకరంద్ తెలిపారు. సమాచారం అందిస్తే వీధి కుక్కలను పట్టుకొని సంతానోత్పత్తిలేకుండా ఆపరేషన్ చేయిస్తామని, వాటి కోపాన్ని తగ్గించే ట్రీట్మెంట్ను వెటర్నరీ డాక్టర్లు ఇస్తారని వివరించారు. ఇందుకోసం మూడు టీమ్లను వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు మేయర్ నీతూకిరణ్ వెల్లడించారు.నిజామాబాద్లోని ఆటో నగర్లో నెల కింద ఇంటి బయట ఏడాది కొడుకుతో కూర్చున్న తల్లి జరీనా.. పాలబాటిల్ కోసం లోపలికి వెళ్లొచ్చే నిమిషం వ్యవధిలో చిన్నారిపై కుక్క దాడి చేసింది. మాక్లూర్లో ఈ నెల 17న మూడేండ్ల పిల్లాడిని కుక్క తీవ్రంగా గాయపర్చింది. ఇంటి బయట ఆడుకుంటుండగా, ఇష్టమొచ్చినట్టు కొరికింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వర్పల్లి శివారులో ఈ నెల 3న రోడ్డై నడుచుకుంటూ వెళ్తున్న ఏడుగురు వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. అంతకు కొన్ని రోజుల ముందు తాడ్వాయి మండలం సోమారం తండాలో ఇంటి బయట ఆడుకుంటున్న ఏడేళ్ల బాలిక శైలజపై కుక్క దాడి చేసింది.

## దంచి కొడుతున్న వానలు

**అదిలాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని చింతలమానేపల్లి, బెజ్జుర్, దేహేగాం మండలాల్లోని మారుమూల గ్రామాల్లో గల కృష్ణపల్లి, దిందా వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో సమీప గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పి శ్రీనివాసరావ్ పలు ప్రాంతాల్లో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులను సందర్శించి అధికారులను, అప్రమత్తంగా ఉండేలా, ఆపదల్లో సహాయక చర్యలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ఎవరూ వెళ్లకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో అధికారులు డప్పు చాటింపు వేయించారు. ప్రజలు భారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం తప్ప ఎవరు బయటకు రావద్దని సూచించారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కుమ్రం భీం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు 3,4,5 నం.గల మూడు గేట్లను 0.30 మీటర్ల మేరకు ఎత్తి 1941 క్యూసెక్కుల నీటినీ అధికారులు దిగువన వదులుతున్నారు. కుమ్రం భీం ప్రాజెక్టు యొక్క పూర్తి స్థాయి నీటిమట్టం 243 మీటర్లు కాగా.. ప్రస్తుతం 237.850 మీటర్లు ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.904 టీఎంసీలలో కొనసాగుతుంది. కుమ్రం భీం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

# మత్స్యకారులకు వరం ‘మత్స్య దర్శిని - నీలం మధు ముదిరాజ్





**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మత్స్యకారులకు ఆర్థికంగా చేయూతనందించే విధంగా కర్ణాటక ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మత్స్య దర్శిని పథకం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని నీలం మధు ముదిరాజ్ అన్నారు. బెంగళూర్ లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకల లో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్సీ జగదేవ్ గుట్టేదార, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మాల బి నారాయణరావు , కేపిసిసి జనరల్ సెక్రెటరీ రాజ్ గోపాల్ రెడ్డితో కలిసి కర్ణాటక ఫిషరీష్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ రిటైల్, ఫిష్ సీడ్ సేల్, రెస్టారెంట్ లను ఆయన సందర్శించారు. ఈ సంధర్బంగా కర్ణాటకలో మత్స్యకారులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కర్ణాటక ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన పథకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మహోన్నత పథకంతో నేరుగా మత్స్యకారులు చాపలను రిటైల్ చేపల ఔట్ లెట్లు నిర్వహిస్తున్న ఫిషరీస్ కార్పొరేషన్ కు అమ్మబడుతున్నాయి. తద్వారా చిన్న తరహా మత్స్యకారులకు ఉపాధి కలిగిందన్నారు. ఈ పథకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉపయోగపడుతుందని వివరించారు. నీలి విప్లవానికి చేయుతానందించి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న కర్ణాటక ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారులంతా ప్రభుత్వానికి అండగా ఉంటూ నిండు మనసుతో మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. తదనంతరం ఎంఎల్సీ,చైర్మన్,ప్రధాన కార్యదర్శి గార్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి, శివ శరణప్ప కొబ్బల్, బీమానా సాల్లి చిత్తపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్,సవారీ నర్సిములు ముదిరాజ్, చించొలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జనార్దన్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జగన్నాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రవీంద్ర నాటికర్, విజయ్ కుమార్ షాబాద్, హెచ్ ములుగప్ప కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సిడిపిఓపై వెంటనే చర్యలు తీసుకోవాలి - తుడుం దెబ్బ డిమాండ్

**వాస్తవ నేస్తం,నిర్మల్:** అంగన్వాడి టీచర్ తప్పుడు ప్రచారం చేస్తుందంటూ మరో కుట్ర చేస్తూ అమాయక ఆదివాసులను ఆసరా చేసుకుని డబ్బులు ఆశ చూపి, ఆదివాసి సంఘాల పేరిట తప్పుడు ప్రచారం చేస్తున్న ఖానాపూర్ సిడిపిఓపై వెంటనే చర్య తీసుకోవాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్య క్షులు వెంకగారి భూమయ్య, జిల్లా కార్యదర్శి తొడుసం గోవర్ధన్ లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. ఖానాపూర్ సిడిపిఓ గతంలో కూడా అక్రమాలకు పాల్పడి అంగన్వాడి టీచర్లను భయాందోళన గురిచేస్తూ అక్రమ వసూలు చేసిందని వారు ఆరోపించారు. గతంలో మజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మందలించి, వదిలి వేశారన్నారు అని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తల నుండి విధంగా నెల నెలలకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిజాలు బయటపెట్టినం దుకు, అంగన్వాడి టీచర్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న సిడిపిఓ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ



కార్యక్రమంలో తుడుం దెబ్బ మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించాలి

**- జిల్లా పాలనాధికారి రాజర్షి షా**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆయిల్ పామ్ సాగు పై జిల్లా పాలనాధికారి రాజర్షి షా సోమవారం వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం



రెండు వేల ఎకరాలలో అయిల్ ఫాం ఏర్పాటు చేయాలని, ఇచ్చోడ, బోథ్, బజార్హత్నూర్, నేరడి గొండ, సిరికొండ మండలాల్లో 500 ఎకరాలలో, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నర్నూర్, తలమడుగు, తాంసి, భీమ్ పూర్ లలో 900 ఎకరాలలో, ఆదిలాబాద్, రూరల్, అర్బన్, మావాల, జైనత్, బేలలో 600 ఎకరాలలో ఈ పంటను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, రైతులను ఐడెంటిఫై చేయాలని తెలిపారు. నెలవారీ టార్గెట్ 230 ఎకరాలలో ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఇందుకు వ్యవసాయ శాఖ అధికారి ఉద్యాన వన శాఖ అధికారులతో కో ఆర్డినేషన్ చేసుకొని లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పుల్లయ్య, హార్టికల్చర్ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ సౌజన్యంతో నిజామాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగష్టు 2, 3, 4 వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా భీంగల్ లోని జె.బి.ఎన్.గార్డెన్స్ లో రాష్ట్ర సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్. బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి. రాజన్న తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్ పోటీలు వుంటాయని ఇందులో పాల్గొనే వారు తమ ఎంట్రీలను ఈ నెల 30 వ తేదీలోగా పంపాలన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 9440010404 సెల్ ఫోన్ ను సంప్రదించాలని వారు కోరారు.

## అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్ష సమావేశం

**- పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** అమరవీరుల స్మృతి వనం, కెస్లాపూర్ నాగోబా దేవాలయ నిర్మాణం, కుంటాల జలపాతం నిర్మాణ పనుల డిజైనర్ , మార్క్యావుట్ ను జిల్లా పాలనాధికారి రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి కాంట్రాక్టర్ లతో మాట్లాడుతూ నాగోబా దేవాలయ నిర్మాణం పనుల్లో జాతర కంటె



ముందే అన్నదాన సత్రం పూర్తి చేయాలని, టర్నింగ్ నుండి దేవాలయం కనిపించేలా ఏర్పాట్లు చేయాలని, ఏకో రిసోర్ట్ కుంటాల జలపాతం వద్ద 5 ఎకరాలలో 8 కాటేజ్ లు, రిసెప్షన్ సెంటర్, డైనింగ్, పార్కింగ్, గెస్ట్ హౌస్, పార్క్, తదితర అంశాలపై డిజైనర్ ప్రశాంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిజైన్ ఫైనల్ చేయడం జరిగిందని పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సమావేశం లో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాథోడ్ భీమ్ రావ్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్ గంగా నదిలో యువకుడు గల్లంతు

**- గాలింపు చర్యలు చేపట్టిన డీడీఆర్ఎఫ్ బృందం**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలోని జైనథ్ మండలం డొల్లార వద్ద పెన్ గంగా నదిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి పోలీస్ లకు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం గాలింపు చర్యలను చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం డీడీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. పెన్ గంగా నది వద్ద



విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన యువకుడు చాంద (టీ) కు చెందిన శివగా గుర్తించారు. గాలింపు చర్యలను ఆదిలాబాద్ జిల్లా ఎస్పి గౌస్ ఆలం పరిశీలించారు. ఎస్పీ వెంట సీఐ సాయినాథ్ ఎస్సై పురుషోత్తం ఉన్నారు.

## బోనాల పండుగకు హాజరైన బిఆర్స్ పార్టీ నాయకులు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం రాలకత్వ గ్రామంలో బోనాల పండుగకు మెట్టు కుమార్ యాదవ్ బొల్లారం బాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతు ఆషాడం మాసంలో రాలకత్వ గ్రామం ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రము లో అమ్మ వారు ప్రజలను సుఖ సంతోషల తో చూడాలని కోరుకున్నాను అని అయిన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ స్ పార్టీ మండల అధ్యక్షులు నాయికోటి రాజేష్ మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, భార్గవ్,నరేందర్, జనార్దన్, చిట్ల సత్యనారాయణ శ్రీశైలం యాదవ్, శ్రీధర్ గౌడ్, కృష్ణ గౌడ్, సాయి భరత్, భీమ్ రావు, గణేష్, శాంతవర్మ రెడ్డి, సుధాకర్ యాదవ్,స్థానిక నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు దేవేందర్, జిన్నారం యూవత అధ్యక్షులు అది రామకృష్ణ, కుమార్ యాదవ్, అంజి గౌడ్, సాని, గణేష్, రైని శ్రీను, శ్రీనివాస్ యాదవ్, పాపయ్య,నవీన్, నర్సింగ్ రావు, రాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


## బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి



**వాస్తవ నేస్తం,కోటగిరి(పోతంగల్) :** కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని మండలంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద సోమవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు రాజు పటేల్, మక్కయ్య, నాగం సాయిలు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ పటేల్, కల్లూరి హన్మండ్లు, సంతోష్, గోవింద్, కిరణ్, మక్కయ్య తదితరులు ఉన్నారు.

## ఎంపీహెచ్ఏ మేల్ ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో లేవనెత్తండి

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఎంపీహెచ్ఏ మేల్ ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో చర్చించాలని ఎంపీహెచ్ఏ మేల్ సంఘం నేతలు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్'లో కేవలం ఎంపీహెచ్ఏ ఫిమేల్ ఉద్యోగాలనే భర్తీ చేస్తున్నారని, తద్వారా రాష్ట్రంలో 12 వేల పైగా మంది ఎంపీహెచ్ఏ మేల్ కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులు నోటిఫికేషన్ల



కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇట్టి విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ మేల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** బోథ్ కేంద్రంలోని పలు సమస్యలను పరిష్కరించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వారసంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. మండల కేంద్రంలోని సాయి నగర్ లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇట్టి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు జక్కుల వెంకటేష్ తెలిపారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com